# కొత్త విలువలు

గిడుగు రాజేశ్వరరావు

లేమివల్ల బ్రతుకు గడవని వాళ్ళు కొందరూ, అన్నీ ఉండి బ్రతకడం రానివాళ్ళు మరి కొందరూ. ఆనందరావుగారి ఏకైక పుత్రిక అనంతలక్ష్మి ఈ రెండో వర్గంలోకి చేరుతుంది. ఇది ఒక్కటే చింత ఆమె భర్త వేణుగోపాలరావును తరుచూ బాధిస్తూ ఉంటుంది. మనసులో ఈ చింత లేకుంటే వేణులా హాయిగా, ఆనందంగా బ్రతికే మనిషి ఇంకొకడు ఉండడు. మేడమీద రేడియోలో వస్తున్న వాద్య సంగీతం వింటూ, ఆఫీసుకు పోయే ప్రయత్నంలో ఉన్న వేణు చెవిలో కింద మామిడిచెట్టు నీడలో చిన్న ఇంటిముందు సాగుతున్న వాగ్వాదం కర్కశంగా అపస్వరంలా పడి బాధిస్తోంది.

మూడు రోజుల క్రితమే చిన్న ఇంట్లో అద్దెకు చేరిన జంటతో లక్ష్మి ఏదో ఘర్షణ పడుతోంది. లక్ష్మిని చేసుకుని ఆనందరావుగారి అల్లుడుగా వేణు అద్దాల మేడలో కాలు పెట్టి సుమారు మూడేళ్ళు అవుతుంది.

అదే ప్రహరీలో మామిడిచెట్టు నీడలో చిన్న ఔట్‌హవుజ్ ఆనందరావు కట్టించి రెండేళ్ళు దాటుతుంది. ఒక చక్కటి చిన్న ఇల్లుగా రూపుదిద్దుకున్న ఆ ఔట్‌హవుజ్‌లోకి కనీసం ఎనిమిదో, తొమ్మిదో కుటుంబాలు వచ్చి వెళ్ళి ఉంటాయని వేణు అంచనా. తొలి రోజుల్లో ఏదైనా వివాదం లక్ష్మికీ, అద్దెకు వచ్చిన వాళ్ళకూ మధ్య వస్తే వేణు కూడా కలగజేసుకుని పరిష్కార మార్గంకోసమో, రాజీకోసమో తాపత్రయపడేవాడు.

అప్పటికి మామగారు మంచం పట్టారు. లేకుంటే ఆ శ్రమ ఆనందరావే పడి వివాదాన్ని మరింత వేడెక్కించగల సమర్థుడే. ఈ వివాదాలన్నిట్లో చాలావరకూ లక్ష్మే తొందరపడిందనో, దురుసుగా ప్రవర్తించి మాటలు విసిరిందనో వేణు అభిప్రాయపడ్డాక విసుగుదలతో ఇక ఆ వ్యవహారం తనది కాదన్నట్లు నిర్లిప్తంగా లక్ష్మికే వదలిపెట్టేశాడు.

ఆ వేళ చిన్న ఇల్లు ఖాళీ చేసి పోతా మంటున్న దంపతులు చిన్న వయసులో ఉన్నవాళ్ళే. ఇంకా పిల్లా జెల్లా లేరు. ఇద్దరూ చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఉన్నట్టుండి ఏమైందో ఏమో ఇద్దరూ గొంతు కలిపి "ఇల్లు ఖాళీ చేస్తాం" అంటున్నారు.

"ఖాళీ చేస్తే చెయ్యండి. నన్ను బెదిరిస్తారా ఏమిటి? మధ్యంతరంగా ఖాళీ చేస్తే అద్దె మాత్రం తిరిగి ఇచ్చేదిలేదు" అని గట్టిగా వినిపిస్తోంది లక్ష్మి గొంతు.


"బెదిరింపేం కర్మ? నిజంగానే ఈ సాయంత్రం ఖాళీ చేస్తాం. డబ్బు పోస్తే ఇంకో ఇల్లు దొరక్కపోదు. అద్దె తిరిగి ఇవ్వకుంటే బాధలేదు. మీరే ఉంచుకోండి. అంతేకానీ ఆ డబ్బు రాబట్టుకుందుకు ఈ నెలంతా మీ గడపలో ఉండి ఈ బాసింగ్ భరించలేం" అని కంచుగంటలా బదులు పలికిం దా యువతి కంఠం.

ఆ రోజు వరకూ అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్న లక్ష్మి అహంకార సామ్రాజ్యం మొట్టమొదటిసారిగా బీటలు వారింది. అంతవరకూ ఇటువంటి ఎదిరింపుకు అలవాటు పడి ఎరుగని లక్ష్మి నిజంగా అవాక్కయి నిలిచిపోయిం దో క్షణం పాటు.

ఆ సాయంత్రమే ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి, మేడమీది బాల్కనీ మీద నిలిచి తాళం వేసి ఉన్న చిన్న ఇంటిని చూసిన వేణుకు జరిగిం దేదో స్పష్టంగా అర్థమైపోయింది. కానీ తనంతట తానుగా ఆ విషయమే లక్ష్మితో ప్రస్తావించలేదు. వంటవాడు భద్రయ్య తెచ్చిపెట్టిన టీ ఊదుకుంటూ నెమ్మదిగా తాగుతూ గతాన్ని నెమరవేసుకున్నాడు.

మామగారు పోతూ పోతూ చేసిన పాడు పనుల్లో అద్దె కివ్వడానికి అనువుగా ఔట్‌హవుజ్ కట్టించడం ఒకటి అనుకున్నాడు. ఆ వచ్చే అద్దెకన్నా ఆ ఇల్లు తెచ్చే ఆత్మక్షోభ, అశాంతీ భరించరానివిగా ఉన్నాయి. ఆ మాట కొస్తే వేణు కూడా మొదట్లో మామగారి ప్రయత్నం మంచిదనే అనుకోకపోలేదు. బిజినెస్ వ్యవహారాల మీద తరుచూ కాంపులు వెళ్తే లక్ష్మి ఒక్కర్తే ఉంటుందనీ, నౌకర్లూ, చాకర్లూ ఉన్నా కాస్త తోడుగా ఒక సాటి కుటుంబం నందడిగా ఉంటే లక్ష్మికి ఊసుపోతుందనీ, ఒంటరితనం ఉండదనీ ఆశపడ్డాడు. అందుకనే మామగారు నిర్లక్ష్యంగా కట్టించి వదేసిన ఔట్‌హవుజ్‌కు అన్ని సౌకర్యాలూ అమరించి, దా న్నొక చక్కని చిన్న ఇల్లుగా ఒక సభ్య కుటుంబానికి వాసయోగ్యంగా ఉండే విధంగా రిపేరు చేయించి ఎన్నో మార్పులు చేయించాడు. వేడి వేడి టీ తాగుతూ మరొకసారి మనసులో అనుకున్నాడు - అసలు ఆ చిన్న ఇల్లు లేకుండా ఉంటేనే లక్ష్మి ప్రశాంతంగా ఉండేదని.

ఆస్తీ, అంతస్తూ, అధికారం అంటూ పరుగుపెడుతూ హరీ మన్నాడు ఆనందరావు. తన కూతురికి ఏ కొరతా లేకుండా అన్నీ ఇచ్చా ననుకున్నాడు. అన్నీ ఉన్నా అర్థవంతంగా జీవించడానికి ఒక ధ్యేయం, లక్ష్యం, అభిరుచీ, అవగాహనా ఉండాలన్న పిచ్చి పిచ్చి ఊహలు అతని మనసులో ఎన్నడూ లేవు. కూతుర్ని వెర్రి అభిమానంతో పెంచి, కళ్ళకు గంతలు కట్టి, ప్రపంచాన్ని యథాతథంగా చూడనీకుండా ఒక సంకీర్ణ వాతావరణంలో క్రోటన్ మొక్కను పెంచినట్లు నీడపట్టున విడిచిపోయాడు. పెద్ద లతనికి పెట్టిన పేరు - ఆనందరావే, కానీ అతని కింద పని చేసిన ఉద్యోగులు అతని పెదవుల మీద చిరునవ్వు ఎన్నడూ చూసి ఎరుగరు. మధ్యంతరంగా జారిపోయిన అతని భార్య ఎన్నడైనా చూసిందేమో తెలియదు. అలా గంభీరంగా ఉండకపోతే ఎవర్నీ అదుపులో పెట్టలేం అని చిన్ననాడు చరిత్రలో బాల్బన్ పాఠం చదువుకున్నప్పుడు స్థిరపడిన ఒక అభిప్రాయం అతన్ని చివరిదాకా గంభీరంగా నడిపించింది. ఆఫీసులో ముఖాన వేసుకున్న గంభీరమైన ముద్ర ఇంటికి కూడా తీసుకుపోయి, వంటవాణ్ణీ, పనిమనిషినీ, ఉదయాన్నే న్యూస్‌పేపర్ కాస్త ఆలస్యం చేసిన కుర్రవెధవనీ హడలగొట్టించేవాడు. ఆలస్యంగా పుట్టుకొచ్చిన అనంతలక్ష్మి కాస్త చనువుగా మెలగగలిగేది. ఆనందరావు విశేషంగా చదువుకున్న వాడు కాదు. అందుకే చదువును అంతగా గౌరవించి ఎరగడు. ఈ వ్యవస్థను బాగా అన్ని కోణాల్లోంచీ చదువుకున్నాడు. అంతకు మించిన చదువును అతను గుర్తించలేదు. రెండు చేతులతో గడించగల ఒక డిపార్టుమెంట్‌లో చేరి, అడ్డుతోవలు చకచకా అర్థం చేసుకుని ఆఫీసర్‌గా ఎదిగిపోయాడు.



ఏడేళ్ళ ప్రాయంలో లక్ష్మి వీధిలో ఆడుకుంటూ అలా అలా ఆనందరావు ఇంటికి కాసింత దూరంలో ఉన్న ఎలిమెంటరీ స్కూలు టీచర్ రామనాథం ఇంట్లోకి తొంగిచూసింది. చిన్న సీమమిరప లాంటి పిల్ల రాధ, తనతోటిదే, వయొలిన్ నెమ్మదిగా వాయిస్తూ ఉంటే చూసింది. లోపలికి అడుగు పెట్టింది. రామనాథం ఆ రోజు ఆదివారం కావడంవల్ల తీరికగా తొడమీద అరచేత్తో తాళం వేస్తూ. నరళీ స్వరాలు వలుకుతూ కూతురు చేత వయొలిన్ ప్రాక్టీసు చేయిస్తున్నాడు. స్వరాలు సులభంగా, శ్రావ్యంగా పలికిస్తోంది రాధ. ముచ్చటగా వచ్చి నిలుచున్న లక్ష్మిని చూసి రామనాథం "రా తల్లీ రా కూర్చో" అని పిలిచాడు.

రాధ స్వరాల్ని తీగలమీద పలికిస్తూ ఉంటే వింతగా వస్తున్న నాదాన్ని ఆశ్చర్యంగా వినింది లక్ష్మి.

మరునాడు సాయంత్రం రాధ ఒక్కతే వయొలిన్ సాధకం చేస్తూ ఉంటే వెళ్ళి చూసిన లక్ష్మి "నేనూ ఒక్కమారు వాయిస్తా"నని అడిగి తీసుకుని వయొలిన్ రాధ పట్టుకున్నట్లే పట్టుకుని వాయించబోయింది. డబ్బారేకు మీద మేకుతో



గీసినట్లు కర్కశంగా ధ్వని వచ్చింది.

లక్ష్మి ఎంతో సిగ్గుపడిపోయింది. రాధంటే విచిత్రమైన ఆకర్షణ ఏర్పడింది. తరువాత ఇద్దరూ కాసేపు వీధిలో ఆడుకున్నారు. అదే సమయంలో ఆఫీసు నుంచి వచ్చిన ఆనందరావు లక్ష్మిని పిలిచి తనతో తీసుకుపోయాడు. ఇంట్లో నౌకర్ల మీద విరుచుకుపడ్డాడు - అలా లక్ష్మిని వీధిలో వదిలినందుకు.

"అలా అడ్డమైన వాళ్ళతోనూ ఆడుకోకూడదమ్మా" అని లక్ష్మిని కాస్త గట్టిగా మందలించాడు.

ఎలాంటి వాళ్ళతో ఆడుకోవచ్చునో లక్ష్మికి అర్థం కాలేదు. ఆనందరావు ఆమెకు వివరించనూలేదు. రాధ తప్ప ఆమెతో ఆడుకునే ఈడైన పిల్లలు ఆమెకు కనపడనూ లేదు. ఇంతలో యాదృచ్ఛికంగా రామనాథం ఇల్లు ఖాళీ చేసి అంతకన్నా తక్కువ బాడుగకు ఇల్లు దొరకడంతో ఎక్కడికో వెళ్ళిపోయాడు. అనుకోకుండా అలా, అంతస్తుకోసం బాధపడే ఆనందరావును కలవరపెట్టే సమస్య పరిష్కారం అయినా, లక్ష్మికి నచ్చిన రాధ స్నేహం అందకుండా పోయింది. కడిగి తుడిచిన పలక లాంటి ఆమె చిన్నారి మనసుమీద గజిబిజిగా తను రోజూ చూస్తున్న జీవిత సత్యాలు, సూత్రాలూ రాసుకుంటూ పోయింది.

అప్పలమ్మ ఉదయాన్నే వచ్చి అంట్లుతోమి, ఇంటి పని చెయ్యాలి. లక్ష్మి దగ్గరగా ఉన్న కాన్వెంట్‌కు వెళ్ళినప్పుడూ, తిరిగి వచ్చినప్పుడూ సూకాలు తన వెంట పుస్తకాల సంచీ మోసుకుపోవాలి. ప్రైవేట్ మాస్టారు ఇంటికి వచ్చి చాపమీద కూర్చుని పాఠాలు చెప్తున్నప్పుడు నాన్నగారు కనిపిస్తే తక్షణమే నిలబడి మలేరియా వచ్చినట్లు మెలికలు తిరిగిపోతూ నమస్కారం చెయ్యాలి. తరువాత ఏం చెయ్యాలో తెలియక కూర్చుని మధ్యలో పాఠం ఎక్కడ ఆగిందో గుర్తుకు రాక తికమకపడాలి. ఇలాంటివే ఆమె రోజూ చూసే జీవిత సత్యాలు.

అలా అణుకువ చూపించే ప్రైవేట్ మాస్టారును చూస్తూ తృప్తిగా తలాడించి పోయేవాడే కానీ, ఆనందరావు "మాస్టారూ - మీరు పాఠం చెప్పుకోండి. నన్ను చూసి లేవనవసరంలేదు" అని వారించి గౌరవించలేదు.

ఇంటికి దగ్గరగా ఉన్న కాన్వెంట్‌లో లక్ష్మి ఒక ఏడాది పరీక్ష తప్పింది. "వెధవలకి చదువు చెప్పడం రా"దని కసురుకుని కాన్వెంట్ మాన్పించాడు. ప్రైవేట్ మాస్టారు మాత్రం కొన్నాళ్ళు పాటు వచ్చారు ఇంటికి. తోటి పిల్లలతో కలిసి తిరిగే ఆనందం అవకాశం కరువైన లక్ష్మి "నాకు ప్రైవేట్ మాస్టారు వ"ద్దని మొరాయించింది. ప్రైవేట్ మాస్టారు కూడా మానుకున్నాడు.

ఇలా పెరిగిన లక్ష్మికి తన చుట్టూ రోజూ తిరిగే మనుష్యులలోనూ వాళ్ళ ప్రవర్తనా, స్వభావాల్లోనూ ఏ వైవిధ్యం కనపడేది కాదు. అప్పలమ్మ సూకాలూ, వంటచేసే భద్రయ్య, ఎప్పుడైనా వచ్చే ఒక రిద్దరు బంధువులూ, ఆ, తరువాత ప్రవేశించిన మేనేజరు కామేశం తప్ప ఇంకో ప్రపంచం లక్ష్మికి తెలియదు. అరుదుగా ఎవరైనా బంధువుల ఇళ్ళలో పెళ్ళిక్కీ, శుభకార్యాలకూ వెళ్ళినా తన వయసు పిల్లలతో కలవాలని ఎంతో ఉత్సాహపడేది. కానీ తన ఈడు పిల్లలకూ, తనకూ మధ్య ఏదో విచిత్రమైన తెర అడ్డు వచ్చేది.

## మూడు

"నీ లక్కీ నెంబరు మూడు ఎలా అయ్యింది?"

"నా తండ్రి చనిపోయిన తేదీ మూడు, నా తల్లి చచ్చిన తేదీ పన్నెండు మా ఆవిడ చచ్చిన తేదీ ఇరవై ఒకటి కాబట్టి"

"అదేమిటి?"

"వాళ్ళంత చస్తే కదా ఆస్తి అంతా నాదై స్వేచ్ఛగా ఉన్నాను."

వీరా ఏడుకొండలు [కంకిపాడు]

వాళ్ళతో ఏ విషయం మాటాడాలన్నా తడుముకోవలసి వచ్చేది. ఉరకలేసే ఉత్సాహంతో ఉన్న ఆ పిల్లలతో సరిగ్గా అడుగులు కలిపి వెయ్యలేని స్థితి ఎదురయ్యేది. వాళ్ళు పోటీ పడి పాటలు పాడినా, ఆట లాడినా, పద్యాలు చదివినా, కథలూ కబుర్లూ చెప్పుకున్నా చిక్కు ప్రశ్నలు వేసి విప్పుకుంటూ వేడుకగా గడుపుతూ ఉన్నా కేవలం వినడం, చూడడమే లక్ష్మి వంతయి, ఆ వేడుక ల్లో పాల్గొన్న తృప్తి లభించేది కాదు. వాళ్ళంతా స్కూళ్ళలోని అనుభవాలు చెప్పుకుంటూ ఉంటే బెరుగ్గా వెనుక వెనుకగా ఉండి తనను తానే వెలివేసుకునేది. క్రమంగా అలాంటి పిల్లలను తప్పించుకుని తనకు తెలిసిన ముసలి అమ్మలక్క లెవరైనా ఉంటే వాళ్ళ మధ్యకు పోయి, వాళ్ళంతా ఆమె మెడలోని నగల్నూ, వేసుకున్న బట్టలూ చూసి విలువ కడుతూ ఉంటే ఏదో గుర్తింపు పొందిన తృప్తి కలిగి వాళ్ళమధ్యే మెదిలేది.

వేణు వాళ్ళ నాయనమ్మ ఒత్తిడి లేకుంటే ఆనందరావుగారి అల్లుడుగా అద్దాల మేడలోకి అడుగుపెట్టే అవకాశం లేదు.


"లక్ష్మి కేమిరా నాయనా చక్కని పిల్ల, తండ్రికి ఆస్తీ, అంతస్తూ ఉంది. నేను హరీమంటే నిన్ను చూసుకునే వాళ్ళెవరూ?" అంటూ చెవిలో నిత్యం పోరేది.

"ఆస్తీ అంతస్తూ ఉంతడంవల్లనే నాకు వద్దంటున్నానే నాయనమ్మా. ఆనందరావుగారికి ఆస్తీ, అంతస్తూ మించి మరో విలువైన వస్తువు లేదు. మనకి ఆ రెండూ లేవు" అని వేణు కుండ బద్దలుకొట్టే విధంగా చెప్పి వారించేవాడు నాయనమ్మను.

"నేనూ, ఆనందరావూ శాశ్వతంగా ఉండిపోతా మట్రా పిచ్చి నాయనా? ఇవాళో, రేపో. లక్ష్మి మంచిపిల్ల. అంతస్తూ, ఐశ్వర్యం ఉన్న ఇంట్లో పుట్టడం దాని అపరాధం అంటావట్రా? లక్ష్మి తల్లిని చిన్నతనం నుంచీ నే నెరుగుదును. చాలా కలుపుగోలు స్వభావం గల మనిషి. పాపం. ఒక్కగా నొక్క పిల్లకు ముద్దూ మురిపెం తీర్చలేకుండానే కన్ను మూసింది" అని వకాల్తా తీసుకున్న వకీలులా ఊదరగొట్టేసింది వేణు నాయనమ్మ.

ఆనందరావు దృష్టి కూడా మొదట్లో సామాన్యుడైన వేణుమీద పడలేదు. కానీ అతని ఆస్తినీ, అపురూపంగా పెంచుకున్న కూతుర్నీ శ్రద్ధగా రక్షించుకుంటాడన్న భరోసా కలిగించిన యువకుడు సులభంగా దొరకలేదు. ఉత్సాహం చూపి ముందుకొచ్చే వాళ్ళంతా ఏదో వ్యసనాలకు బానిసలు. తరగనంత ఆస్తి కావాలని వెతుక్కుంటున్న వాళ్ళే. తనువే అశాశ్వతమని తోస్తున్న రోజుల్లో వేణుమీదా, అతని నాయనమ్మ మీదా ఒత్తిడి తెచ్చి, ఒప్పించి లక్ష్మి పెళ్ళి చేశాడు ఆనందరావు. కూతుర్నీ కోరి తెచ్చుకున్న అల్లుడినీ, అందంగా కట్టించిన అద్దాల మేడనూ, అదే ప్రహరీలో కట్టించిన ఔట్‌హౌస్‌నూ విడిచి వెళ్ళక తప్పలేదు. ఎన్నో వ్యాపార సంస్థల్లో కూతురి పేరా, అల్లుడి పేరా వాటాలూ, వేణుమీద బరువు బాధ్యతలూ ఉంచి, తన బాధ్యత తీర్చుకుని ఎంతో గంభీరంగా కన్ను మూశాడు.

అడుగులకు మడుగు లొత్తే అప్పలమ్మా వంట చేసిపెట్టే భద్రయ్యా మేనేజరు కామేశం లాంటి మనుషులతో దైనందిన జీవితం మలుచుకున్న



ఫోటో: పి. జానకిరామయ్య [హైదరాబాదు]

లక్ష్మికి అంతకన్నా విజ్ఞతా, లోకానుభవం రాలేదు. ప్రతి రోజూ మధ్యాహ్నం, రాత్రీ నిద్రకు పది, పదకొండు గంటలు పోయినా మిగిలిన కాలాన్ని గడపడం పెద్ద సమస్య. అద్దాలమేడ మీంచి చూస్తే కనిపించే చిన్న ఇల్లు ఎంతో చిన్నదిగా, ఓ ఆట వస్తువులా తోచేది ఆమెకు. అందులో జీవిస్తూ అద్దె ఇస్తున్న బ్రతుకులు మరింత చిన్నవిగా కనిపించేవి. అందుకే అద్దెకున్న ప్రాణులు తన ఉనికినీ, ఔన్నత్యాన్నీ గుర్తించి అణిగి మణిగి ఉండాలన్న కోరిక తప్ప వాళ్ళ జీవితాల్లో తనకు తెలియరాని అందాలూ, ఆనందాలూ ఉండవచ్చునన్న ఆలోచన ఎన్నడూ రాలేదు లక్ష్మికి. తనను చూసి అడుగులకు మడుగు లొత్తే గుణం లోపించినా, తన ఉనికిని ప్రత్యేకంగా గుర్తించలేకపోయినా ఆ చిన్న ఇంట్లో ఎవ్వరూ ఎక్కువకాలం ఉండలేకపోయేవారు.

వేణు ఆమె అదృష్టం కొద్దీ సౌమ్యుడూ, శాంత స్వభావుడూ. అతనికి నిజంగా వ్యసనమంటూ ఏదైనా ఉంటే ఒక్కటే. పల్లె పదాలైనా - పలూస్కర్ భజనలైనా శ్రావ్యంగా ఉన్న రికార్డులూ, కేసెట్‌లూ కొనుక్కుని తెచ్చుకు విని ఆనందించడమే. అదే ఒక అవలక్షణంగా భావించి అల్లుడు డబ్బూ కాలం వృథా చేస్తున్నాడని మంచాన పడ్డ చివరి రోజుల్లో ఆనందరావు నణుక్కునేవాడు.

అద్దెకు వచ్చి ఉన్నపళంగా ఖాళీ చేసిన యువ జంట మొట్టమొదటిసారి లక్ష్మిని వాస్తవిక జీవితంలోకి లాక్కుపోయి ఆలోచించే అవకాశం కలిగించింది. ఇంతవరకూ వచ్చిన కుటుంబాలు లక్ష్మి మాటలకూ, అతిశయానికీ ఏవగించుకున్నా ఏదో సాకుమీద వెళ్ళిపోయాయి కానీ, సాహసించి ఒక విషయాన్ని చెప్పలేకపోయాయి. అద్దెకు వచ్చినవాళ్ళు అణిగీ మణిగీ ప్రైవేట్ మాస్టారులా, అప్పలమ్మలా, భద్రయ్యలా, మేనేజర్ కామేశంలా ఉండేనవసరం లేదనీ, అలా నమ్రతగా ఉండాలన్న సూత్రమో, సిద్ధాంతమో లేదనీ లక్ష్మి తొలిసారిగా తెలుసుకుంది.

రెండు నెలలు ఖాళీగా పడి ఉన్న ఆ చిన్న ఇంట్లోకి మేనేజర్ కామేశం ధర్మమా అని ఒక చిన్న కుటుంబం ప్రవేశించింది. మధ్యవయసులో అడుగు పెడుతున్న దంపతులూ, స్కూలుకు పోయే వయసున్న ఇద్దరు పిల్లలూ - చూడడానికి ముచ్చటగా ఉంది ఆ కొత్త కుటుంబం. ఆ ఇల్లాలు సాదా నేతచీరతో, మెడలో నల్లపూసలతో, నుదుట కుంకుమబొట్టుతో నిరాడంబరంగా, ప్రశాంతంగా ఉంది. ఆమె భర్త లాల్చీ పంచెతో అతి సామాన్యంగా, సాధారణంగా ఉన్నాడు. ఏ ఆఫీసుకూ అతను పోతున్న సూచనలు లేవు. ఇంటిపట్టున ఉండి సాయంత్రం ఎక్కడికైనా వెళ్ళి వస్తూ ఉంటాడు. లక్ష్మి ఈమధ్య మరీ నిర్లిప్తంగా ఉండడంవల్ల ఇంతకన్నా ఎక్కువగా వాళ్ళ గురించి వివరంగా తెలుసుకోలేదు. అద్దె వెనకపెట్టకుండా నెల నెలా ఇవ్వగలిగే వాళ్ళేనా అన్న సందేహం కాస్త ఆమె మనసులో మెదలకపోలేదు.

ఒకనాటి రాత్రి బాల్కనీలో కూర్చునీ విశ్రాంతి తీసుకుంటున్నాడు వేణు. ఏదో శ్రావ్యమైన సంగీతం గాలిలో తేలి వస్తూ మనసును మృదువుగా స్పృశిస్తోంది. దూరంగా ఎక్కడో రేడియోలోంచి వస్తున్న సంగీత మన్న భ్రాంతితో అతని పక్కనే ఉన్న ట్రాన్సిస్టర్ ఆన్ చేసి చూశాడు. కానీ, ఆ సంగీతాన్ని ట్రాన్సిస్టర్ అందివ్వలేకపోతోంది.

బాల్కనీలో అటూ ఇటూ తిరుగుతూ చిన్న ఇంటి దిశగా చూశాడు. పిల్ల లిద్దరూ పుస్తకాలు పెట్టుకొని ఏదో రాసుకుంటున్నారు. తల్లి వయొలిన్ వాయిస్తోంది, వీధివేపు వరండాలో కూర్చుని. తండ్రి చేత్తో తాళం వేస్తూ ప్రశాంతంగా సంగీతం వింటున్నాడు. ఆ ఇల్లాలు వేసుకుపోతున్న నిరవలూ, చేసుకుపోతున్న స్వరకల్పనలూ, గాలిలోనికి తేలికగా విడిచిపెడుతున్న మనోధర్మ సంగీతంలోని వైదుష్యం సాంకేతికంగా వేణుకి ఎక్కువగా తెలియకపోవచ్చునేమో కానీ, ఆ సంగీతంలోని మాధుర్యం అతన్ని మంత్రముగ్ధుణ్ణి చేసేసింది.

దీపాల వెలుగులో, వరండాలో కూర్చున్న ఆ నలుగురు సభ్యులున్న చిన్న కుటుంబాన్ని చూస్తూనే ఎంతో ముచ్చట వేసింది. అదే సమయంలో అటుగా బాల్కనీలోనికి వచ్చిన లక్ష్మి వేణు ఏకాగ్రతకు కారణం అర్థంకాక అతని వెనుకగా వచ్చి నిల్చుని చిన్న ఇంటి దిశగా చూసింది. లక్ష్మి వచ్చిన అలికిడికి ఇహలోకంలోకి వచ్చిన వేణు వింతగా భార్య వేపు చూశాడు.

లక్ష్మికి, చిన్నతనంలో రాధ చేతిలో వయొలిన్ మొట్టమొదట చూడడం గుర్తుకు వచ్చింది. ఆ మరునాడు ఉదయమే పోర్టికోలో కారు శబ్దం విని ఎవరో అని బాల్కనీలోంచి కిందకు చూసింది లక్ష్మి. అందమైన రెండు జడల అమ్మాయి కారులోంచి దిగి నౌకర్ని ఏదో అడిగి చిన్న ఇంటివేపుగా వెళ్ళింది. లక్ష్మి ఉత్కంఠతో చిన్న ఇంటి వేపు చూసింది. ఆ అమ్మాయి ఎంతో అణకువతో ఆ ఇల్లాలికి నమస్కరించి ఏదో మాట్లాడి తిరిగి వెళ్ళిపోబోతోంది.

లక్ష్మి కిందకు వచ్చి "ఆ ఇంట్లో ఉన్న వాళ్ళెవరు? మీకు బంధువులా?" అని అడిగింది.

ఆ ప్రశ్నకు ఎంతో వింతగా లక్ష్మి వేపు జాలిగా చూసినట్లున్నాయి ఆ అమ్మాయి కాటుక కళ్ళు.

"ఆమె మంచి సంగీత విద్వాంసురాలు. ప్రస్తుతం ఇక్కడ ఉంటున్నారని తెలిసి కలుసుకుందుకు వచ్చాను" అని ముక్తసరిగా చెప్పి కారులో వెళ్ళిపోయింది.

లక్ష్మి కొన్ని క్షణాల తరువాత చిన్న ఇంటి దిశగా వెళ్ళడం ఆఫీసుకు వెళ్ళిపోతున్న వేణుని ఆశ్చర్యంలో ముంచేసింది. అయితే ఈమారు లక్ష్మి తన కున్న అలవాటుగా ఏ నౌకర్నీ వెంట పెట్టుకుని వెళ్ళకుండా ఒక్కర్తె వెళ్ళింది.

సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఈ కుటుంబం కూడా ఇల్లు ఖాళీ చెయ్యదు కదా అన్న భావన వేణు మనసులో మెదలకపోలేదు.

లక్ష్మిని ముంగిట్లో చూస్తూనే లోనికి రమ్మని పిల్చి కుర్చీ చూపించిం దా చిన్న ఇంట్లో అద్దె కున్న ఇల్లాలు. కుర్చీలో కూర్చుంటూ "మీలా నేను వయొలిన్ వాయించడానికి ఎన్ని రోజులు పడుతుంది? నేను నేర్చుకుంటాను. ఎంత తీసుకుంటారు?" లక్ష్మి అడిగింది.

అంగడికి పోయి ఏదో వస్తువును 'కొనుక్కుందుకు అడిగినట్లుంది - ఆ ప్రశ్న. 'ఎన్ని రోజులు పడుతుంది' అని అడిగిన ప్రశ్నలోని అజ్ఞానానికీ, అమాయకత్వానికీ కాసింత నవ్వు రాకపోలేదు, జాలి కూడా వేసిం దా ఇల్లాలికి.

---

ప్రేయసీ ప్రియులు ఏకాంతంలో మాట్లాడుకొంటున్నారు.

"మన పెళ్ళికి మీ అమ్మ నాన్నలు ఒప్పుకున్నారా?" అని అడిగింది ప్రేయసి నును సిగ్గుతో.

"నాన్న ఆయన అభిప్రాయాన్ని ఇంకా చెప్ప లేదు. అమ్మ ఆయన అభిప్రాయాన్ని ఎప్పుడు విమర్శిద్దామా అని ఎదురు చూస్తూ కూర్చుంది" అన్నాడు ప్రియుడు.


## ఓడ

రాజారావు బాగా తాగి ఓ బస్సెక్కాడు. ఒక రూపాయి పట్టుకుని తన ముందు స్నతని చొక్కా లాగడం ప్రారంభించాడు. అతను కోపంగా, "నా దగ్గర టిక్కెట్లు లేవు. కండక్టర్ నడగండి .. నేను నేవల్ ఆఫీసరుని" అన్నాడు.

వెంటనే రాజారావు "అయితే ఈ ఓడ నావండి. నేను బస్సులో వెళ్ళాలి" అన్నాడు కంగారుగా.

వి.ఎన్.వి.కృష్ణ [కంకిపాడు]

---



"మీరు ఇదివరలో ఏమైనా నేర్చుకున్నారా?" అన్నది.

"లేదు. మీరు నేర్పితే రేపే వయొలిన్ కొనుక్కుంటా" అంది లక్ష్మి ఆత్రతగా.

లక్ష్మిని చూసినా, ఆమె మాటలు విన్నా ఏదో విచిత్రమైన అభిమానం కలిగింది.

చనువుగా ఏకవచన ప్రయోగం చేస్తూ "నేను రెండు, మూడు నెలల కన్నా ఎక్కువ ఇక్కడ ఉండనేమో. సంగీత విశ్వవిద్యాలయం ఆవరణలో మా క్వార్టర్స్ కట్టడం పూర్తి అయిపోతే నేను అక్కడకు వెళ్ళిపోవాలి" అన్న దా ఇల్లాలు.

"మీ వారేమి ఉద్యోగం చేస్తా"రని లక్ష్మి అడిగిన ప్రశ్నకు కూడా అసాధారణమైన జవాబు వచ్చింది.

"వారు ఏ ఆఫీసులోనూ ఉద్యోగం చెయ్యడం లేదమ్మా. ఏవో బొమ్మలు గీస్తారు, రంగులు వేస్తారు. ఇది నీ ఇల్లేగా? సందేహం దేనికి" అని చిరునవ్వుతో గదిలోనికి తీసుకుపోయి చూపించిందామె.

పూర్తి అయిన చిత్రాలు కొన్ని రంగులు వెయ్యకుండా రేఖామాత్రంగా ఉన్న చిత్రాలు కొన్నీ ఆ గదినిండా ఉన్నాయి. ప్రముఖులతో ఆమె భర్త తీయించుకున్న ఫోటోలు చాలా ఉన్నాయి.

కలయో వైష్ణవ మాయయో అన్నట్లయింది లక్ష్మి పరిస్థితి. ఎటు చూసినా చిత్రాలే ! తూరుపు వాకిలి తెరుస్తున్న తొలి ఉషస్సూ, పసుపు కుంకుమ లారబోస్తున్న సాయంసంధ్య వానజల్లులూ, హరివిల్లూ వసంతఋతు వైభవాలూ, మేఘమాలికలూ, పొలం పనుల్లో మునిగిపోయిన పల్లెపడుచులూ, వరికోతలూ, బండరాళ్ళను పెకలిస్తూ కండలు కరిగిస్తున్న శ్రమజీవులూ, సంక్రాంతి సంబరాలూ... ఇలా ఎన్నో దృశ్యాలు సజీవంగా ఎదుర్కొని లక్ష్మిని ఉక్కిరిబిక్కిరి చేసేశాయి. ఏదో వింత లోకంలోకి లాక్కుపోయిన భ్రాంతి కలిగింది. చెప్పుకోదగ్గ విద్యావికాసం, లోకానుభవం లేని లక్ష్మి ఆ చిత్రాలను విమర్శించి విలువ కట్టలేకపోవచ్చు. కానీ, ఆ చిన్న ఇంట్లో తను చూస్తున్న కళా సంపద అసాధారణమైనదన్న భావన రాకపోలేదు. ఆ చిన్న ఇల్లు ఇంతింతై వటు డింతయై అన్న విధంగా ఆకాశానికి ఎదిగి పక్కనే ఉన్న అద్దాలమేడను సమూలంగా పగలగొట్టి నేలకూల్చినట్లయింది.

> ## ప్రేమంటే ?
>
> రిక్షాలో వెళ్తున్నారు ప్రసాద్, పల్లవి.
>
> "నీ వాళ్ళు కాదన్నా నా వాళ్ళు కాదన్నా అందర్నీ ఎదిరించి నిన్నెలాగైనా పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు ప్రసాద్.
>
> "ఉద్యోగం లేనిదే పెళ్ళి చేసుకుంటే ఎలా బ్రతకగలం?" అడిగింది పల్లవి.
>
> "రిక్షా తొక్కి అయినా నిన్ను పోషించుకుంటాను" చెప్పాడు ప్రసాద్.
>
> అంతలో రిక్షా వాడు కల్పించుకొని "నేనూ అలాగే ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నానండి. కాని ఆ అమ్మాయి రిక్షా తొక్కే వాడివి నీతో నా కేంటి అని ఓ కారున్న బాబుతో వెళ్ళి పోయింది" అన్నాడు.
>
> నందిగాం మురళీమోహన్
>
> [నరసన్నపేట]

ఇంతవరకూ తా నెరుగని ఒక కొత్త ప్రపంచం, డబ్బుతో కొనలేని సరికొత్త విలువలూ ఎదురై, ఇరుకైన లక్ష్మి మనస్సులో ఏదో న్యూనతా భావం, ఏదో దైన్యం, ఏదో అసంతృప్తి కలిగేలా చేశాయి. స్పష్టమైన భావప్రకటన చెయ్యగల శబ్దపుష్టీ, భాషా సంస్కారం ఆమెలో లేవు కానీ, అల్లకల్లోలంగా చెలరేగిన ఆలోచనలకు రూపకల్పన చేస్తే సుమారుగా ఇలా ఉంటాయి-

ఏ నగలూ, ఆడంబరాలూ లేని ఆ ఇల్లాలు ఒక సంగీత మహాసాగరం. సృష్టికి ప్రతిసృష్టి చేయగల కళాకారు డామె భర్త. వీళ్ళు నివసించేది చిన్న ఇల్లైనా, ఔట్‌హౌస్ అయినా విలువ తెలిసిన వాళ్ళు వెతుక్కుని రాకతప్పదు. కాటుక కళ్ళ అమ్మాయి చూపులలో కనపడిన భావానికి లీలగా అర్థం స్ఫురించింది లక్ష్మికి ఇప్పుడు.

"మీరు ఇక్కడే ఉండిపొండి. క్వార్టర్స్‌కి వెళ్ళనే వద్దు. వెళ్ళక తప్పదంటే, నేనే మీరున్న క్వార్టర్స్‌కి వచ్చి సంగీతం నేర్చుకుంటాను. నాకు మీరు వయొలిన్ నేర్పక తప్పదు" అన్నది లక్ష్మి చిన్న చంటిపాప తల్లిని చూస్తున్నట్లు గోముగా చూస్తూ.

ఎద్దురుగా ఉన్న ఆ ఇల్లాలు ఎంతో ప్రసన్నంగా చూస్తూ "తప్పక నేర్చుకుందువు గాని. కానీ ఇప్పుడే కొత్త వయొలిన్ కొనుక్కోనవసరం లేదమ్మా. ప్రాక్టీసు చెయ్యడానికి నా దగ్గర ఒక వయొలిన్ ఉంది. శ్రుతి నిలిపి, షడ్జమ పంచమాలు స్పష్టంగా పలికించాక వయొలిన్ అవసరమైతే కొనుక్కుందువు గాని నెమ్మదిగా..." అని మాట ఇచ్చింది.

అలాగే లక్ష్మి మూడు రోజులు శ్రద్ధగా, విసుగు లేకుండా మధ్యస్థాయి నిచ్చెనలో షడ్జమ పంచమ స్వరాలు పలికించింది.

ఎన్నడూ క్రమశిక్షణా, కుదురూ, పొందికా ఎరగని చేతి వేళ్ళు ఆమె చెప్పినట్లూ వినక ఎంతో మొరాయించాయి. కమాను ఎంత ఓర్పుతో నడిపించినా దారి తప్పి సంచరించి కష్టపెట్టింది. ఒకవేళ సరిగ్గా నడచినా కమానుకీ, తంత్రికీ సమన్వయం ఒకంతట సాధ్యపడలేదు. అపస్వరాల బెడద చాలా ఇబ్బంది పెట్టింది.

ఈ క్లేశంతో కళ్ళ వెంట నీళ్ళు వచ్చినంత పనైంది. ఈ శ్రమలోంచి ఒక విచిత్రమైన సంస్కారం లక్ష్మి జీవితంలో మొలకెత్తింది. అతి సున్నితంగా, సునాయాసంగా అదే వయొలిన్ మీద, అవే తంత్రుల మీద అతిలోక మధురంగా స్వరాలు పల్కించి చూపిస్తున్న ఆ ఇల్లాలు ఎంత సాధన చేసి ఉంటుంది, ఎంత తపస్సు చేసి ఉంటుంది - అని ఊహించుకుని ఆశ్చర్యపడింది.

ఆ రాత్రే ఒక స్థిర నిశ్చయానికి వచ్చినట్లు వేణుతో "నేను సంగీతం నేర్చుకుంటున్నాను. నాకొక వయొలిన్ తెప్పించండి" అని అడిగింది.

లక్ష్మి ఎన్నాళ్ళు సంగీతం నేర్చుకుందో, ఎంత ఎత్తుకు ఎదిగిందో సంగీత సాధనలో అన్న విషయం తెలియదు. అంత ముఖ్యం కూడా కాదు. కానీ, నాటి నుంచీ లక్ష్మి తన అద్దాలమేడ కవతల ఉన్న విశాలమైన ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడం ప్రారంభించింది. ఆమె ప్రవర్తనలోనూ, మాటలోనూ వచ్చిన సౌమ్యత ఆమె నెరిగిన వాళ్ళందరినీ ఆశ్చర్యపరచింది.

జీర్ణశిశిరాంతంలో చిక్కని పచ్చని చివురు కనుపించినట్లయింది వేణు మనోనేత్రానికి.

పతనమైన సామ్రాజ్య శిథిల శకలాల్లోంచి నిజంగానే సరికొత్త విలువలు ఏరుకుంది లక్ష్మి.

